www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 4 జులై 2024
5
ఏలూరు



కలెక్టర్ చొరవతో వృద్ధుడికి పెన్షన్

ఏలూరు :నగరంలో ఒక వృద్ధుడు తనకు పెన్షన్ అందలేదని కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఫోన్ 9491041188 నెంబర్‌కు వాట్సాప్ ద్వారా తెలియజేయగా కలెక్టర్ వెంటనే స్పందించి అధికారులను ఆదేశించడంతో గంటల వ్యవధిలో ఆ వృద్ధుడికి పెన్షన్ సచివాలయ సిబ్బంది పెన్షన్ అందించారు. పోలవరానికి చెందిన సామజిక పెన్షన్ లబ్ధిదారు యు.వెంకటరమణమూర్తి జూన్ 29వ తేదీన ప్రమాదానికి గురవ్వడంతో ఏలూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వం అందిస్తున్న పెన్షన్ తనకు రాదేమోనని ఆందోళనతో కలెక్టర్ వెట్రిసెల్వికి వాట్సాప్ ద్వారా తన తమస్యను తెలిపారు. రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి పర్యటన సందర్భంగా పోలవరంలో పర్యటిస్తున్న కలెక్టర్ సదరు వాట్సాప్ సమాచారంపై వెంటనే స్పందించి ఏలూరులోని డిఆర్‌డిఎ పిడను సదరు వెంకటరమణమూర్తికి ఏలూరు ఆసుపత్రిలో పెన్షన్ అందించాలని ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాలతో అధికారులు హుటాహుటిన స్పందించి వెంకటరమణమూర్తిని కలిసి సచివాలయ సిబ్బందిచే పెన్షన్ అందించారు.

పంట రుణాల టార్గెట్ ఏదీ..!

- కొత్త ప్రభుత్వంపై కౌలురైతులు గంపెడాశలు
- కౌలురైతులకు పంట రుణాల మంజూరుపై చర్యలు కరువు
- బ్యాంకర్ల కమిటీ సమావేశం జరిపి టార్గెట్లు ఇచ్చేనా?
- రెండు జిల్లాల్లో మూడు లక్షల మంది ఎదురుచూపు
- కౌలు కార్డుల జారీలోనూ కొరవడిన చర్యలు



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

కౌలు రైతులకు పంట రుణాల మంజూరులో బ్యాంకర్లకు టార్గెట్ విధించి కొత్త ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు. గత ప్రభుత్వంలో కౌలు రైతుల పట్ల తీవ్ర నిర్లక్ష్యం కొనసాగిందని, కూటమి ప్రభుత్వం తమకు న్యాయం చేస్తుందని రైతులు ఎన్నో ఆశలు పెట్టుకున్న పరిస్థితి నెలకొంది. పశ్చిమ, ఏలూరు జిల్లాల వ్యాప్తంగా ఖరీఫ్‌లో 4.30 లక్షల ఎకరాల్లో రైతులు వరిసాగు చేస్తున్నారు. రెండు జిల్లాల్లో దాదాపు మూడు లక్షల మంది కౌలు రైతులు ఉండగా, వ్యవసాయ సాగులో 70 శాతానికిపైగా వీరే చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అత్యధికంగా కౌలు రైతులు ఉన్న జిల్లాలు ఇవే. తాము అధికారంలోకి వస్తే కౌలు రైతులకు న్యాయం చేస్తామంటూ టిడిపి కూటమి హామీ ఇచ్చింది. దీంతో కౌలు రైతులంతా కూటమి అభ్యర్థులకు ఓట్లేసి జిల్లాలో అన్ని సీట్లు కట్టబెట్టారు. అంతేకాకుండా డిప్యూటీ సిఎం, జనసేన అధినాయకుడు పవన్‌కల్యాణ్ తన ప్రసంగంలో ఎక్కువగా కౌలురైతుల గురించి మాట్లాడుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో పంటలు పండక అప్పులపాలై ఆత్మహత్యలు చేసుకున్న కౌలు రైతులకు పవన్‌కళ్యాణ్ తన సొంత సొమ్ములు వెచ్చించి ఆర్థిక సాయం అందించడం అందరికీ తెలిసిందే. ఇప్పుడు ఆయనే ప్రభుత్వంలో కీలక స్థానంలో ఉండడంతో కౌలు రైతులలు మరిన్ని ఆశలు పెట్టుకున్న పరిస్థితి ఉంది. ఏటా బ్యాంకర్ల కమిటీ సమావేశం పెట్టి ఈ ఆర్థిక సంవత్సరంలో పంట రుణాలు ఎంత మేర మంజూరు చేయాలి. కౌలు రైతులకు ఎన్ని కోట్ల రుణాలు ఇవ్వాలనే దానిపై ప్రభుత్వం టార్గెట్లు పెడుతుండడం జరుగుతోంది. ఇప్పటివరకూ రెండు జిల్లాల్లోనూ కౌలు రైతులకు ఈ ఏడాది ఇచ్చే పంట రుణాలపై టార్గెట్లు విధించిన పరిస్థితి లేకుండా పోయింది. బ్యాంకర్లు కౌలు రైతులకు రుణాలు ఇచ్చేందుకు ముందుకు రాకపోవడం ఏటా కొనసాగుతోంది. 2014-2019 మధ్యకాలంలో టిడిపి ప్రభుత్వం కౌలు రైతులకు రుణాల మంజూరులో ప్రత్యేక చర్యలు తీసుకుంది. దీంతో కొంతమేర రైతులకు మేలు జరిగింది. వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత కౌలు చట్టంలో భూ యజమాని అంగీకారంతోనే కౌలు కార్డులు జారీ చేయాలని నిబంధనలు విధించింది. దీంతో కౌలు కార్డులు జారీతోపాటు, పంట రుణాల మంజూరు సైతం అంతంతమాత్రం అన్నట్లుగా పరిస్థితి మారిపోయింది. దీంతో కౌలురైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కౌలు కార్డులు ఇవ్వకపోవడంతో పంట రుణంగానీ, ప్రభుత్వం అందించిన రైతు భరోసా, దెబ్బతిన్న పంటలకు సాయం, బీమా వంటివి ఏ ఒక్కటీ కౌలు రైతులకు అందలేదు. చివరికి పండించిన పంటను సైతం భూ యజమాని పేరున అమ్మాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో కౌలురైతుల పరిస్థితి అధ్వానంగా మారింది.

కౌలు కార్డుల జారీ.. పంట రుణాలు ఇచ్చేదెప్పుడు..!

ఏప్రిల్‌లో ప్రారంభం కావాల్సిన కౌలుకార్డుల జారీ ప్రక్రియ ఎన్నికల నేపథ్యంలో జరగలేదు. కొత్త ప్రభుత్వం ఏర్పడి రోజులు గడుస్తున్నా ఇప్పటికీ కౌలు కార్డులు జారీ వేగంగా ముందుకు సాగని పరిస్థితి నెలకొంది. రెండు జిల్లాల్లో ఇప్పటివరకూ పట్టుమని రెండు వేల కౌలు కార్డులు కూడా జారీ కాకపోవడం అందుకు నిదర్శనంగా చెప్పొచ్చు. ప్రస్తుతం ఖరీఫ్ సాగు ముమ్మరంగా సాగుతోంది. మెట్ట ప్రాంతంలో నాట్లు, డెల్టాలో నారుమడుల పనుల్లో రైతులు మునిగి తేలుతున్నారు. వ్యవసాయానికి పెట్టుబడులు అత్యంత అవసరం. వెంటనే కౌలుకార్డుల జారీ ప్రక్రియ పూర్తిచేసి, బ్యాంకుల నుంచి పంట రుణాలు మంజూరు చేపట్టాలని కౌలు రైతులు కోరుతున్నారు. కొత్త ప్రభుత్వం ఆ విధంగా దృష్టి సారిస్తేనే కౌలురైతులకు న్యాయం జరిగే పరిస్థితి ఉంటుంది.

పోలవరం ప్రాజెక్టును సందర్శించిన కలెక్టర్

ప్రజాశక్తి - పోలవరం

జిల్లా కలెక్టర్ కె.వెట్రి సెల్వి పోలవరం ప్రాజెక్టును బుధవారం పరిశీలించారు. అధికారులతో కలిసి ప్రాజెక్టును, అక్కడ పనులను కలెక్టర్ నిశితంగా పరిశీలించారు. ప్రాజెక్టు పనుల పురోగతిపై ఇఇ పి.వెంకటరమణ, అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రాజెక్టు సైట్‌లో ఏర్పాటు చేసిన ప్రాజెక్టు మోడల్ గ్యాలరీని పరిశీలించారు. కలెక్టర్ వెంట ఐటిడిఎ పిఒ ఎం.సూర్య తేజ, జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ కె.అద్దయ్య, తహశీల్దార్ ప్రసాద్, ఇంజినీరింగ్ అధికారులు ఉన్నారు.



పోలవరం ప్రాజెక్టుకను పరిశీలిస్తున్న కలెక్టర్ వెట్రి సెల్వి

ఎన్నికల వ్యయ నివేదికను 30 రోజుల్లోగా పంపాలి

జిల్లా జాయింట్ కలెక్టర్ బి.లావణ్య

ప్రజాశక్తి - ఏలూరు

అభ్యర్థుల ఎన్నికల వ్యయానికి సంబంధించిన దస్త్రాలన్నీ ఎన్నికల ఫలితాలు ప్రకటించిన 30 రోజుల్లోగా జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ద్వారా ఎన్నికల కమిషన్‌కు సమర్పించాల్సి ఉందని జిల్లా జాయింట్ కలెక్టర్ బి.లావణ్య వెల్లడించారు. సార్వత్రిక ఎన్నికల్లో పార్లమెంటు, అసెంబ్లీకి పోటీ చేసిన అభ్యర్థులు, వారి తరపున ఏజెంట్లు, నియోజకవర్గ రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులతో బుధవారం స్థానిక కలెక్టరేట్లోని గోదావరి సమావేశ మందిరంలో అభ్యర్థుల ఎన్నికల వ్యయ నివేదికలపై ఎన్నికల కమిషన్ నియమించిన ఎన్నికల వ్యయ పరిశీలకులైన మేశారం గౌరవ్ మధుకర్, టి.జోర్డాన్ బూటియాతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులంతా ఎన్నికల నియమ నిబంధనలను పాటించాల్సి ఉందన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే తదుపరి ఎన్నికల్లో పోటీ చేసే అవకాశాలు కోల్పోతారని స్పష్టం చేశారు. పార్లమెంటు, శాసనసభ స్థానాల్లో పోటీచేసిన అభ్యర్థులు ఎన్నికలకు వెచ్చించిన వ్యయానికి అకౌంట్స్ స్పష్టంగా చూపాలని సూచించారు. దస్త్రాల నమోదులో తప్పులు, పొరపాట్లు చేసి ఉంటే వాటిని తక్షణం సరిదిద్దుకోవాలన్నారు. సమావేశంలో డిఆర్ఒ డి.పుష్పమణి, రిటర్నింగ్ అధికారులు ఎస్ఎస్ కె.ఖాజావలి, వై.భవానీ శంకరి, కె.భాస్కర్, ముక్కంటి, కలెక్టరేట్ ఎఒ కె.కాశీ విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

నేడే మామిడి రైతుల సమావేశం

ప్రజాశక్తి - నూజివీడు

నూజివీడులో మామిడి మార్కెట్ ఏర్పాటుకు సంబంధించి రైతులు, వ్యాపారులు, సంబంధిత అధికారులతో ఈ నెల 4వ తేదీ గురువారం ఉదయం 10.30 గంటలకు ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నట్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు తెలిపారు. ఈ సమావేశానికి రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార శాఖా మంత్రి కొలుసు పార్థసారథి ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు. ఏలూరు జిల్లా నూజివీడు, ఆగిరిపల్లి, చాట్రాయి, ముసునూరు మండలాలతో పాటు ఎన్‌టిఆర్ జిల్లా విస్సన్నపేట, తిరువూరు, మైలవరం, రెడ్డిగూడెం, ఎ.కొండూరు పరిసర ప్రాంతాల మామిడి రైతులు సమావేశానికి హాజరు కావాలని ఆయన కోరారు.

మరో మేకపై చిరుత దాడి

ప్రజాశక్తి - పోలవరం

పోలవరం ఏజెన్సీ గ్రామంలో చిరుత మళ్లీ మరో మేకపై మంగళవారం రాత్రి దాడిచేసి చంపేసింది. దీంతో ఏజెన్సీ గ్రామాల గిరిజనులు భయాందోళన చెందుతున్నారు. అటవీ శాఖ అధికారి ఎన్.దావీదురాజు తెలిపిన వివరాల ప్రకారం. పోలవరం మండలం వింజరం పంచాయతీ సున్నాలగండి గ్రామ సమీపంలో అడవిలో అదే గ్రామానికి చెందిన మేకల కాపరి మడకం పుల్లారావుకు చెందిన మేకపై మంగళవారం రాత్రి చిరుత దాడిచేసి చంపిందని తెలిపారు. దీంతో ఏజెన్సీ ప్రాంతవాసులు భయభ్రాంతులకు గురువుతున్నారు.

ఎర్ర కాలువ మిగులు భూములు పేదలకు పంచాలి

వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యాన జెండా పాతి భూ పోరాటాన్ని ప్రారంభించిన రవి

ప్రజాశక్తి - టి.నర్సాపురం

ఎర్ర కాలువ రిజర్వాయర్ ప్రాజెక్టు మిగులు భూములను పేదలకు పంచాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.రవి డిమాండ్ చేశారు. బుధవారం వ్యసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సంఘం జెండాను ఎర్రకాలువ మిగులు భూమిలో పాతి భూ పోరాటాన్ని రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.రవి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎర్ర కాలువ రిజర్వాయర్ మిగులు భూములను పేదలకు పంచాలన్నారు. ఎనిమదేళ్లుగా పేదలు భూపోరాటం చేస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం సిగ్గుచేటన్నారు. భూస్వాములు ఇచ్చే లంచాలు మింగి ఈ భూములను వారికి కట్టబెట్టాలని అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. చట్ట విరుద్ధంగా, చట్టాన్ని ధిక్కరిస్తూ భూములను భూస్వాములకు ఏ విధంగా కట్టబెడతారని ప్రశ్నించారు. ప్రభుత్వం నుంచి లాభాలు పొంది తర్వాత ప్రభుత్వ భూములు తమవే అనడం దుర్మార్గం అన్నారు. నాటి ప్రభుత్వం రిజర్వాయర్ కోసం సేకరించిన భూములకు అప్పటి రేటు కేటాయించి రైతులకు, భూస్వాములకు పూర్తిస్థాయి పరిహారం ఇచ్చిందని తెలిపారు. కానీ పరిహారం పొందిన వాళ్లే నేడు భూములను సాగు చేయడం ఎంతవరకూ సమంజసం అని ప్రశ్నించారు. ఇప్పటికే భూమిలేని దళితులు, గిరిజనులు ఇతర కులాల్లోని పేదలకు ఈ భూములు అప్పజెప్పాలని కోరారు. వారికి ఎక్‌సాల్ పట్టాలు ఇవ్వాలని, ఇరిగేషన్ అధికారులు స్పందించాలని డిమాండ్ చేశారు. కొత్త ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు సమస్యలు పరిష్కరించాలని కోరారు. పోలవరం, చింతలపూడి నియోజకవర్గ ఎంఎల్ఎలు ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎం.జీవరత్నం, పి.రామకృష్ణ మాట్లాడుతూ ఏళ్ల తరబడి ఈ ప్రాంతంలో గిరిజనులు, దళితులు, భూమిలేని నిరుపేదలైన వారు వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని తెలిపారు. అలాంటి వారికి ఈ మిగులు భూములు అప్పజెప్పి సాగు చేసుకునే అవకాశం కల్పించాలని కోరారు. ఎర్రకాలువ మిగులు భూముల్లో పేదలు, దళితులు, గిరిజనులు వారి హక్కుల కోసం పోరాడుతున్న వారిపైన భూస్వాములు అక్రమ కేసులు పెట్టి భయభ్రాంతులకు గురి చేశారని విమర్శించారు. చట్టాన్ని దిక్కరించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇరిగేషన్, రెవెన్యూ శాఖ అధికారులు సకాలంలో స్పందించి పేదలకు న్యాయం చేయాలని కోరారు. ఎర్రకాల్వ రిజర్వాయర్ మిగులు భూములను వెంటనే భూస్వాముల నుండి ప్రభుత్వం స్వాధీనం చేసుకొని భూమి లేని పేదలకు పంచాలని డిమాండ్ చేశారు. ఈ ప్రాంతంలో వ్యవసాయ అభివృద్ధికి ప్రభుత్వం పూనుకోవాలని కోరారు. వ్యవసాయ కూలీల సమస్యలను, పేదలు ఇబ్బందులను పరిష్కరించాలన్నారు. ఈ భూముల్లో అక్రమంగా కరెంటు తీసుకున్న భూస్వాములపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు తామా ముత్యాలమ్మ, మండపం సుధారాణి, జిల్లా కమిటీ సభ్యులు యాగంటి సీత, అనుమోలు మురళి తదితరులు నాయకత్వం వహించుగా గంగాభవాని, రామలక్ష్మి, చెల్లమ్మ, రాజు, సిద్ధు, మరో వంద మంది పేదలు దళితులు గిరిజనులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు రవి

బోట్ పాయింట్ ఏర్పాటు చేయాలి

మంత్రి నిమ్మలకు పోలవరం బోట్ ఓటర్స్ అసోసియేషన్ సభ్యుల వినతి

ప్రజాశక్తి - పోలవరం

పోలవరం మండల పరిధిలో బోట్ పాయింట్ ఏర్పాటు చేయాలని కోరుతూ రాష్ట్ర భారీ జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుకు పోలవరం బోట్ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు వినతిపత్రం అందించారు. బుధవారం పోలవరం ప్రాజెక్టు కార్యాలయంలో కలిసి ఈ వినతిపత్రం అందించారు. పోలవరం మండల పరిధిలో స్పిల్‌వేకి సమీపంలో ఉన్న పాత పైడిపాక గ్రామంలో బోట్ పాయింట్ ఏర్పాటు చేయడం ద్వారా ఉభయగోదావరి జిల్లాల పర్యటకులు పాపికొండల పర్యటనకు వెళ్లేందుకు ప్రయాణం సౌకర్యంతంగా ఉంటుందన్నారు. పాత పైడిపాక గ్రామంలో బోట్ పాయింట్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని బోట్ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు మంత్రిని కోరారు. ఈ కార్యక్రమంలో బోట్ ఓనర్ అసోసియేషన్ సభ్యులు గెడా మురళీకృష్ణ, కొల్లు వెంకట నరేష్, పెమ్మాడి శ్రీనివాస్ పాల్గొన్నారు.



మంత్రి నిమ్మలతో బోట్ ఓటర్స్ అసోసియేషన్ సభ్యులు

27 ఏళ్ల ప్రాయంలోనే అల్లూరి త్యాగం

జయంతి వేడుకల్లో వక్తలు

ప్రజాశక్తి - ఏలూరు

అల్లూరి సీతారామరాజు తన 27 ఏళ్ల జీవితంలో తరతరాలకు గుర్తుండే త్యాగాన్ని చేశారని ప్రజానాట్యమండలి రాష్ట్ర నాయకులు కె.శాంతారావు, ఇ.మంగరాజు, 127వ జయంతి వారోత్సవం కమిటీ ఏలూరు కన్వీనర్ దేవరకొండ వెంకటేశ్వర్లు, ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహరావు, మానవతా నాయకులు మేతర అజయ్‌బాబు, అల్లూరి సీతారామరాజు, స్టేడియం వాకర్స్ నాయకులు ఎండి అక్బర్ జగదీష్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.లెనిన్, ఏలూరు డిగ్రీ కళాశాల శాశ్వత భవనాల సాధన కమిటీ నాయకులు పి.దుర్గాప్రసాద్ అన్నారు. సురేష్ చంద్రబహుగుణ పోలీస్ స్కూల్‌లో సర్‌సిఆర్ రెడ్డి పాలిటెక్నిక్ కళాశాలలో కె.శాంతారావు మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు జన్మించిన పశ్చిమ గోదావరి జిల్లా వాసులందరూ గర్వంగా అనుభూతి పొందుతారన్నారు. 27 ఏళ్లు మాత్రమే బతికిన అల్లూరి సీతారామరాజు మన్యం వీరుడిగా స్వతంత్ర్య పోరాట యోధుడిగా నిలిచారన్నారు. 127వ జయంతి వారోత్సవ కమిటీ కన్వీనర్, బహుజన ఆఫీసర్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ దేవరకొండ వెంకటేశ్వర్లు బాయ్స్ కాన్వెంట్ సత్రంపాడు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పాల్గొని మాట్లాడారు. ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహరావు మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు 127వ జయంతి వారోత్సవ సభల్లో భాగంగా బుధవారం 20 విద్యాలయాల్లో విద్యార్థులకు అల్లూరి సీతారామరాజు జీవితం మీద డ్రాయింగ్, ఏకపాత్రాభినయం, వేషధారణ, ఉపన్యాసం పోటీలు నిర్వహించినట్లు చెప్పారు. మంగరాజు, సూర్యప్రకాష్ అల్లూరి సీతారామరాజుపై పాటలు పాడారు. సభల్లో వీరభద్రరావు, ఎస్.కస్తూరిరావ్, దువ్వి రామారావు, డి.హేమసుందర్, గుబ్బల నాగేశ్వరరావు, పెరియార్, కె.రాజు అనిల్, రామకృష్ణ, మేరీ, బి.అలేఖ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వక్తలు

అల్లూరి సీతారామరాజుకు ఘన నివాళి

జీలుగుమిల్లి : అల్లూరి సీతారామరాజు 127వ జయంతి వేడుకలను మండలంలోని దిబ్బగూడెం గ్రామంలో డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సీతారామరాజు చిత్రపటానికి డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జి.సూర్యకిరణ్, శ్రీనివాస్ పూలమాలవేసి నివాళులర్పించారు.

ఎంఎల్‌ఎ చంటి సాయంతో నగరాభివృద్ధి

మేయర్ నూర్జహాన్ పెదబాబు

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

పార్టీలకతీతంగా ఎంఎల్ఎ బడేటి చంటి సహకారంతో నగరాన్ని పూర్తిగా అభివృద్ధి పరుద్దామని నగరపాలక సంస్థ మేయర్ నూర్జహాన్ పెదబాబు అన్నారు. నగర పాలక సంస్థ కౌన్సిల్ సర్వసభ్య సమావేశం నూర్జహాన్ పెదబాబు అధ్యక్షతన బుధవారం మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ నూర్జహాన్ పెదబాబు మాట్లాడుతూ ఎజెండాలో పొందుపరిచిన 11 అంశాలు తాగునీరు, వీధి దీపాలు, స్కూల్లో పనిచేస్తున్న పార్ట్ టైమ్ స్వీపర్లకు కంటిజెన్సీ ఛార్జీలు, అద్దె భవనాల్లో ఉన్న సచివాలయాల అద్దె చెల్లింపు, అదేవిధంగా కార్పొరేషన్‌కు ఆదాయం వచ్చేవిధంగా పెట్రోల్ బంక్ డీలర్ షిప్ తీసుకోవడం వల్ల బంకు నిర్వహణ మూలధనంతో పాటు కమిషన్ కూడా వస్తుందన్నారు. దీంతో సభ్యులందరూ అన్ని అంశాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. నూతనంగా ఎన్నికైన ఎంఎల్ఎను కార్పొరేటర్లందరం కలిసి నగర అభివృద్ధికి పూర్తిగా సహకరిస్తామని తెలియ జేశామన్నారు. ఏలూరు నగర అభివృద్ధికి చక్కటి మాస్టర్‌ప్లాన్ తయారై ఉందన్నారు. కో-ఆప్షన్స్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు మాట్లాడుతూ నగరపాలక సంస్థ అభివృద్ధి విషయంలో ప్రతి విషయాన్ని ఎంఎల్ఎ చంటి దృష్టిలో పెట్టి వారి ఆమోదంతోనే పనులు చేయనున్నట్లు చెప్పారు. పార్టీలకు అతీతంగా అధికారులందరూ కార్పొరేటర్లను గౌరవించాలన్నారు.

పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలి

అంగన్‌వాడీ కేంద్రాల్లో కలెక్టర్ వెట్రిసెల్వి తనిఖీలు

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

పాఠశాలల్లో పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలని కలుషితమైన తాగునీరు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి సూచించారు. మండలంలోని రామనరసాపురంలో ప్రభుత్వ పాఠశాల అంగన్‌వాడీ కేంద్రాలను కలెక్టర్ కె.వెట్రిసెల్వి తనిఖీ చశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్య ద్వారానే అభివృద్ధి సాధ్యమని, ప్రతి పేద కుటుంబం పేదరికం నుంచి వచ్చేందుకు తమ పిల్లలను విద్యావంతులుగా చేయాలని కలెక్టర్ అన్నారు. పిల్లల తరగతి గదికి వెళ్లి పిల్లలకు అందిస్తున్న విద్యాబోధనలపై ఆరా తీశారు. విద్యార్థుల ఆరోగ్య విషయంలో అప్రమత్తంగా ఉండాలని, పాఠశాల పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. పాఠశాలలో పారిశుధ్యాన్ని పరిశీలించారు. అనంతరం రాజానగరంలోని జిటిడబ్ల్యూ బాలికల ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేశారు. పాఠశాలల్లో మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉంచాలని, విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, నాణ్యమైన విద్య అందించి ఉత్తీర్ణత శాతం పెరిగే విధంగా ఉపాధ్యాయులు, స్కూల్ ప్రిన్సిపల్ పిల్లలకు విద్యాబోధనలు అందించాలని కలెక్టర్ ఆదేశించారు. ఆమెతో పాటు ఐటిడిఎ పిఒ ఎం.సూర్యతేజ, ఆర్‌డిఒ కె.అద్దయ్య, తహశీల్దార్లు, ఎంఇఒలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరులో వందేభారత్‌కు హాల్ట్ ఇవ్వాలి

రైల్వే మంత్రిత్వ శాఖ, రైల్వే బోర్డు ఛైర్మన్ జయవర్మసిన్హాకు ఎంపీ మహేష్ వినతి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఏలూరు రైల్వే స్టేషన్‌లో వందేభారత్ రైళ్లకు హాల్ (నిలిపేందుకు) అనుమతి ఇవ్వాలని, భద్రాచలం-కొవ్వూరు రైల్వే లైన్ పనులు వేగవంతం చేయాలని కోరుతూ కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖ, రైల్వే బోర్డు ఛైర్మన్ సిఇఒ జయవర్మసిన్హాకు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ బుధవారం వినతిపత్రం అందించారు. జయవర్మసిన్హా ను న్యూఢిల్లీలోని రైల్ భవన్‌లో బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి ఏలూరు ప్రజల సౌకర్యార్థం వారి ఆకాంక్ష మేరకు సికింద్రాబాద్ నుంచి వైజాగ్ (వయా విజయవాడ) వెళ్లే వందే భరత్ రైలు ఏలూరు రైల్వే స్టేషన్‌లో హాల్ట్ (నిలిపేందుకు) అనుమతిని కోరుతూ సంబంధిత అధికారులకు తగిన ఆదేశాలు ఇవ్వాలని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ కోరారు. ఈ సందర్భంగా పుట్టా మహేష్‌కుమార్ మాట్లాడుతూ జయవర్మసిన్హా సానుకూలంగా స్పందించినట్లు చెప్పారు. వారు త్వరలో ఏలూరులో వందే భారత్ రైలు నిలిపేందుకు తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని తెలిపారు. 2012లో మంజూరైన 53 కిలోమీటర్ల పొడవైన భద్రాచలం-కొవ్వూరు రైల్వే లైన్‌తో హైదరాబాద్ - విశాఖపట్నం మధ్య ప్రయాణ సమయం రెండు గంటలు తగ్గుతుందని జయవర్మ సిన్హాకు చెప్పామని తెలిపారు. ఈ లైన్ పూర్తయితే ఏలూరు జిల్లాలోని అసెంబ్లీ సెగ్మెంట్ల అభివృద్ధికి కూడా దోహదపడుతుందని, ఆ పనులు వేగవంతం చేయాలని కోరగా త్వరలో పనులు జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారని తెలిపారు.



జయవర్మసిన్హాకు వినతిపత్రం అందిస్తున్న ఎంపీ మహేష్

వికలాంగుల అభ్యున్నతికి సహకరించాలి

భీమడోలు సిఐ రవికుమార్

భీమడోలు :వికలాంగుల్లో దాగి ఉన్న అపరిమితమైన స్వాభావిక ప్రతిభను పెంపొందించడం తోపాటు, వారి వికాసానికి ప్రతిఒక్కరూ తమ వంతు సహాయ, సహకా రాలు అందించాలని భీమడోలు సిఐ బిబి.రవికుమార్ కోరారు. గుండుగొలనులో బుధవారం నిర్వహించిన రెండు వేర్వేరు కార్యక్రమాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అతిథిగా భీమడోలు ఎస్ఐ వై.సుధాకర్ హాజరయ్యారు. శ్రీ విఘ్నేశ్వర వికలాంగుల సేవాసమితి ఆధ్వర్యంలో ప్రతి నెల నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా స్థానికంగా 60 మంది వికలాంగులకు దాతల సహకారంతో సన్నబియ్యం, పండ్లు, పోషకాహారం అందించే కార్యక్రమానికి వారు హాజరయ్యారు. ఈ సందర్భంగా దాత మంతెన సూర్యనారాయణరాజు సమకూర్చిన సన్న బియ్యం, ఇతర వస్తువులను విఘ్నేశ్వర వికలాంగుల సేవా సమితి తరపున వికలాంగులకు అందించారు. వేరొక కార్యక్ర మంలో భాగంగా శ్రీ విద్యాలయ ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాలలో చదివి గతేడాది నిర్వ హించిన పదో తరగతి పరీక్షా ఫలితాలలో మార్కుల సాధనలో మండల స్థాయిలో ద్వితీయ స్థానంతో పాటు ఇతర స్థానాలు సాధించిన ముగ్గురు విద్యార్థులకు ప్రతిభా పురస్కార అవార్డులు అందించారు. ఈ సందర్భంగా దాత దాట్ల సూరపరాజు జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు అందించిన నగదు అందించారు.

నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు

జిల్లా వ్యవసాయాధికారి షేక్ హబీబ్ బాషా

ప్రజాశక్తి -ముదినేపల్లి

నకిలీ విత్తనాలు, కల్తీ పురుగు మందులు అమ్మేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయాధికారి షేక్ హబీబ్‌భాషా హెచ్చరించారు. మండలంలోని ముదినేపల్లి, పెయ్యేరు, పేరూరు, సింగరాయపాలెం, శ్రీహరిపురం గ్రామాల్లో బుధవారం విస్తృతంగా పర్యటించి ఎరువులు, విత్తనాల విక్రయ దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రస్తుతం వ్యవసాయ శాఖ ద్వారా అమలులో ఉన్న వివిధ పథకాలను సమీక్షించారు. రైతులకు పలు సూచనలు, సలహాలు అందించారు. ముదినేపల్లిలోని వరుణ్ సీడ్స్ షాపులో సరైన రికార్డులు సమర్పించని కారణంగా రూ.22 వేల విలువైన ఐదు క్వింటాళ్ల వరి విత్తనాల అమ్మకం నిలుపుదల చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు.

ఉపాధి హామీ కూలీల వేతనాలు విడుదల చేయాలి

వ్యవసాయ కార్మిక సంఘం

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

ఉపాధి హామీ కూలీలకు రావాల్సిన వేతన బకాయిలను వెంటనే విడుదల చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల శాఖ అధ్యక్షురాలు కారం నాగదుర్గ డిమాండ్ చేశారు. అంకన్నగూడెం పంచాయతీలోని దిబ్బగూడెం గ్రామంలో ఉపాధి హామీ కూలీల సమస్యలపై బుధవారం చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏడు వారాలుగా ఉపాధి హామీ పని చేస్తున్న కూలీలకు రావాల్సిన వేతనాలను ఇప్పటి వరకు విడుదల చేయకపోవడం బాధాకరమన్నారు. పొట్ట కూటి కోసం పనుల్లేక ఉపాధి పనికి వెళ్తున్నవారికి సకాలంలో వేతనాలు అందకపోవడం వల్ల చాలా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి వేతన బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిరిబత్తుల సీతారామయ్య, కల్లూరి దావీదు, గుండె గంగరాజు, ప్రమీల పాల్గొన్నారు.

తెలంగాణ మంత్రిని కలిసిన బసవరెడ్డి

ప్రజాశక్తి - చాట్రాయి

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సరిహద్దులు, ఆర్అండ్‌బి రోడ్ల అభివృద్ధి గురించి తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని టిడిపి జిల్లా అధికార ప్రతినిధి మందపాటి బసవరెడ్డి కలిసి చర్చించారు. ఇంటి వద్ద కలిసి శాలువాతో సత్కరించి రాష్ట్ర సరిహద్దు రోడ్ల వెంసురు-చాట్రాయి మండలానికి సంబంధించి ఉన్న కందుకూరు నుంచి చిన్నంపేట వరకు ఉన్న రోడ్డును అభివృద్ధి చేయాలని కోరారు.

విజయవాడ వెళ్లి పింఛన్ అందజేత

ప్రజాశక్తి - చింతలపూడి

విజయవాడ హాస్పిటల్‌లో ఉన్న డయాలసిస్ పేషెంట్‌కు చింతలపూడి-1 వెల్ఫేర్ అసిస్టెంట్ శివ పింఛన్ అందించారు. సుమారు వంద కిలోమీటరర్ల దూరం వచ్చి వృద్ధాప్య పింఛన్ అందించడంతో ఆ కుటుంబం ఆనందాన్ని వ్యక్తం చేసి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్‌కి ధన్యవాదాలు తెలిపారు. సచివాలయ సిబ్బంది శివను ఎంఎల్ఎ రోషన్‌కుమార్‌ను అభినందించారు.

'ప్రశ్నించే గొంతును నొక్కడం సరికాదు'

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

కాంగ్రెస్ నేత, ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ పార్లమెంట్‌లో బిజెపిని, ప్రధాని మోడీని వివిధ అంశాలపై ప్రశ్నించినందుకు సమాధానం చెప్పలేక ఆయా అంశాలను పక్కదోవ పట్టించేందుకు బిజెపి శ్రేణులు కాంగ్రెస్ కార్యాలయం ముందు రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దహనం చేయడాన్ని సిపిఎం ఏలూరు జిల్లా కమిటీ తరపున ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి బుధవారం ఓ ప్రకటనలో ఖండించారు. మతంపేరుతో బిజెపి దేశంలో పెడుతున్న చిచ్చును, మోడీ నిరంకుశ పరిపాలనను ఎండగట్టే విధంగా పార్లమెంట్‌లో రాహుల్ గాంధీ చేసిన ప్రసంగానికి సమాధానం చెప్పడం చేతగాని బిజెపి నిరసన కార్యక్రమాలకు దిగడం వారి దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు.

ఏలూరు టౌన్ :సమస్యలను పరిష్కరించటం మానేసి ప్రశ్నించే గొంతు నొక్కాలని మోడీ ప్రయత్నించడం సరికాదని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు రాజనాల రామ్మోహన్‌రావు అన్నారు. పార్లమెంట్‌లో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ప్రధాని మోడీని వివిధ అంశాలపై ప్రశ్నించినందుకు సమాధానం చెప్పలేక ఆయా అంశాలను పక్కదోవ పట్టించేందుకు కాంగ్రెస్ జిల్లా కార్యాలయం ఎదురుగా బిజెపి శ్రేణులు రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేసే ప్రయత్నాన్ని రామ్మోహన్‌రావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు తిప్పికొట్టాయి. ఈ సందర్భంగా రాజనాల రామ్మోహన్‌రావు మాట్లాడుతూ డి మోనిటైజేషన్ నుంచి ఇప్పటివరకు మోడీ ప్రభుత్వం చేసిన అఘాయిత్యాలకు మోడీని దేశ బహిష్కరణ చేయాలని వ్యాఖ్యానించారు. సమస్యలను పరిష్కరించటం మానేసి ప్రశ్నించే గొంతు నొక్కాలని మోడీ ప్రయత్నిస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో సాదే బాబుప్రసాద్, లంక రామ్మోహన్, దాసరి రాంప్రసాద్, కొమ్మన సాంబశివరావు, దండుబోయిన చంద్రశేఖర్, కెఎస్ఎన్.మూర్తి, సేవాదళ్ సుబ్బారావు లాజర్, సూర్యనారాయణ పాల్గొన్నారు.

'7న దండోరా జెండాలు ఎగరవేయాలి'

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎంఆర్‌పిఎస్) ఆవిర్భావించి ఈ నెల ఏడో తేదీతో 30 సంవత్సరాలు పూర్తి చేసుకుని 31వ సంవత్సరంలోకి అడుగు పెడుతున్న సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రతి మాదిగ పేటల్లో దండోరా జెండాలు ఎగరవేయాలని మాన్య శ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశించారని నూజివీడు నియోజకవర్గ అధ్యక్షులు దుబ్బాకు దేవరాజు తెలిపారు. నూజివీడు నియోజకవర్గంలో మాదిగ సోదరులు ఈ కార్యక్రమంలో విధిగా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

'గ్రామీణ ప్రజలకు విష్ణుకుమార్‌రాజు క్షమాపణ చెప్పాలి'

ప్రజాశక్తి - టి.నరసాపురం

బిజెపి ఎంఎల్ఎ విష్ణుకుమార్‌రాజు గ్రామీణ ప్రాంతాల ప్రజలకు క్షమాపణ చెప్పాలని వైసిపి ఎస్‌టి సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కురసం నిరీక్షణరావు బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలు సోమరిపోతులని బిజెపి ఎంఎల్ఎ విష్ణుకుమార్ రాజు మాట్లాడడం శోచనీయమన్నారు. ఎంఎల్ఎ తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని, గ్రామీణ ప్రాంత ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

విద్యార్థులకు నగదు బహుమతులు

పోలవరం :గూటాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి, ఇంటర్‌లో గణితంలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ముడుంబై శ్రీనాథ్ మెమోరియల్ నగదు బహుమతి అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కెవి.రాఘవన్, ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

భార్యాభర్తలపై హత్యాయత్నం

విజయవాడ ఆసుపత్రిలో చికిత్స

ప్రజాశక్తి - ముదినేపల్లి

మురుగునీరు నడకదారిపైకి వచ్చాయన్న విషయమై రెండు కుటుంబాల మధ్య ఏర్పడిన ఘర్షణ చిలికి చిలికి గాలి వానగా మారి హత్యాయత్నానికి దారి తీసింది. ఈ ఘటన ఏలూరు జిల్లా ముదినేపల్లి మండలంలోని చిగురుకోట గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చిగురుకోట గ్రామానికి చెందిన పరసా వెంకట బాలాజీ ఇంటికి ఉత్తరం వైపున తుమ్మ సురేష్ ఇల్లు ఉంది. తుమ్మ సురేష్ కుటుంబ సభ్యులు ఇంట్లో వాడిన మురుగునీరు రోడ్డు మీదకు రావడంతో సదరు విషయంలో ఇరు కుటుంబాల వారు అనేక మార్లు గొడవ పడగా పెద్దల సమక్షంలో పరిష్కరించుకుంటూ ఉండేవారు. అదేవిధంగా బుధవారం కూడా సురేష్ కుటుంబసభ్యులు వాడిన మురుగునీరు నడక దారిలోకి వచ్చాయని బాలాజీ భార్య దేవి, సురేష్ భార్య అనిత ఇద్దరూ గొడవ పడ్డారు. ఈ నేపథ్యంలో సురేష్ కత్తితో, అతని భార్య అనిత చాకుతో బాలాజీపై, అతని భార్య దేవిపై దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డారు. ఈ ఘటనలో వెంకట బాలాజీకి, అతని భార్య దేవికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి వివరాలు సేకరించారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం గుడివాడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. వారి పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం విజయవాడ తరలించారు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ వెంకటకుమార్ ఘటనాస్థలానికి చేరుకుని స్థానికుల నుంచి వివరాలు సేకరించారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ డి.వెంకట్‌కుమార్ తెలిపారు.

దిశా వన్‌స్టాప్ సెంటర్ తనిఖీ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ వారి ఆదేశాల ప్రకారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తం కుమార్ ఆధ్వర్యంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్ బుధవారం దిశా వన్ స్టాప్ సెంటర్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. తాత్కాలిక వసతి గృహంలో ఉన్న బాధితులకు అందిస్తున్న వసతులపైన వివరణ అడిగి తెలుసుకున్నారు.

ఇంటర్ కళాశాలల పరిస్థితిపై ఎంఎల్ఎ సమీక్ష

ప్రజాశక్తి - చింతలపూడి

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థుల సంఖ్య పెరిగే విధంగా చర్యలు చేపట్టాలని చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ సూచించారు. చింతలపూడి క్యాంపు కార్యాలయంలో ఆయన డివైఇఒ ప్రభాకరరావుతో ఇంటర్ కళాశాలల పరిస్థితిపై బుధవారం సమీక్షించారు. జూనియర్ కళాశాలలో విద్యార్థుల సంఖ్య పెంచడం, తరగతి గదులు, అధ్యాపకుల సంఖ్య తదితర అంశాలపై సమీక్ష నిర్వహించి కళాశాలల మెరుగైన నిర్వహణ కోసం తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్ఎ మురళీరామకృష్ణ పాల్గొన్నారు.

వరిలో సమగ్ర యాజమాన్యంపై శిక్షణ

ప్రజాశక్తి - కామవరపుకోట

రైతులు మంచి దిగుబడినిచ్చే వరి రకాలను సాగు చేసి అధిక లాభాలను పొందాలని గుంటూరు ఆచార్య ఎన్‌జి.రంగా వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు లలిత సుధా అన్నారు. మండలంలో రావికంపాడు గ్రామంలో ఏరువాక కార్యక్రమంలో భాగంగా వరిలో సమగ్ర యాజమాన్యంపై రైతులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏరువాక కేంద్రం సమన్వయ కర్త డాక్టర్ కె.ఫణికుమార్ వరిలో నారుమడి యాజమాన్యం పద్ధతుల గురించి, ప్రధాన పొలంలో కలుపు యాజమాన్యం గురించి వివరించారు. వరి సాగులో రైతులు అడిగిన సందేహాలను ఆయన నివృత్తి చేశారు. మండల వ్యవసాయాధికారి సి.పవన్‌కుమార్, ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త ఎన్.నాగేంద్ర బాబు, విఎఎఎస్.వెన్నెల, రైతులు పాల్గొన్నారు.

బస్సుల సంఖ్య పెంచాలని ఎంఎల్ఎకు వినతి

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడి-విజయవాడ బస్సు సర్వీసులు పునరుద్ధరించడానికి కృషి చేస్తానని చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ అన్నారు. చింతలపూడి- ఏలూరు బస్సుల సంఖ్య పెంచాలని కోరుతూ జనసేన నాయకులు విజయ్‌కుమార్, భారతి ఎంఎల్ఎకు బుధవారం వినతిపత్రం అందించారు. సాయంత్రం పూట ఆరు దాడిన తరువాత సత్తుపల్లి వెళ్లడానికి బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు.

పాఠశాలకు అనుమతులు ఉన్నాయి

విశ్వతేజ ప్రిన్సిపల్ దాసు

ప్రజాశక్తి - కామవరపుకోట

కామవరపుకోటలో ఉన్న విశ్వతేజ ఇంగ్లీష్ మీడియం పాఠశాలకు ఎటువంటి అభ్యంతరాలు లేవని, స్కూలులో చదివే విద్యార్థులకు ఎటువంటి ఆటంకాలు కలగవని జిల్లా విద్యాశాఖాధికారి తెలిపినట్లు ఆ పాఠశాల ప్రిన్సిపల్ జి.దాసు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇటీవల విశ్వతేజ స్కూల్లో చదివితే విద్యార్థుల భవిష్యత్తుకు ఆటంకం కలుగుతుందని వచ్చిన పుకార్లను ఆయన ఖండించారు. తమ స్కూలుకు అన్ని రకాల అనుమతులు ఉన్నాయని తెలిపారు.

మంచినీటి చెరువు వివాదంలో ఉద్రిక్తత

చావలిపాడులో ఇరు గ్రూపుల మధ్య ఘర్షణ
పరిస్థితిని అదుపులోకి తెచ్చిన సిఐ, తహశీల్దార్

ప్రజాశక్తి - మండవల్లి

నూతన మంచినీటి చెరువు ఏర్పాటుపై చావలిపాడు గ్రామంలో బుధవారం ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. ఇరుగ్రూపులు ఘర్షణకు దిగడంతో సమాచారం అందుకున్న పోలీసులు, తహశీల్దార్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... చావలిపాడు పంచాయతీకి చెందిన సుమారు 14 ఎకరాల భూమిని మత్స్యకార సొసైటీ సభ్యులకు లీజుకు ఇచ్చారు. గ్రామంలో ఉన్న రెండున్నర ఎకరాల మంచినీటి చెరువు గ్రామంలోని ప్రజల దాహార్తిని తీర్చలేకపోవడంతో 14 ఎకరాల్లోని ఐదు ఎకరాల మంచినీటి చెరువుగా చేసేందుకు పంచాయతీ తీర్మానించింది. మత్స్యకార సొసైటీ సభ్యులు దీనిని వ్యతిరేకిస్తూ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. న్యాయస్థానం పరిశీలించి చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేసింది. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్‌డిఒ గ్రామంలో పర్యటించి పరిస్థితిని సమీక్షించారు. తాగునీటి అవసరాల నిమిత్తం చెరువు తవ్వకం తప్పనిసరని, మంచినీటి చెరువు తవ్వేందుకు న్యాయస్థానం అధికారులు సానుకూలంగా స్పందించారన్నారు. దీంతో సర్వే చేస్తుండగా మత్స్యకార సొసైటీ సభ్యులు అడ్డుకోవడంతో ఇరుగ్రూపుల మధ్య వివాదం చెలరేగింది. సమాచారం తెలుసుకున్న తహశీల్దార్ సుభాని, కైకలూరు సిఐ కృష్ణకుమార్, ఎస్ఐ రామచంద్రరావు సంఘటనా స్థలానికి చేరుకుని గొడవ సద్దుమణిగేలా చేశారు. న్యాయస్థానం ఆదేశాల ప్రకారం చేస్తున్న పనులను అడ్డుకోవడం సమంజసం కాదని, ఏదైనా ఉంటే శాంతియుతంగా పరిష్కరించుకోవాలని తెలిపారు.

పొజీషన్ సర్టిఫికెట్లు మంజూరు చేయాలి

మంత్రిని కోరిన ప్రజలు

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

40 ఏళ్లుగా హైస్కూల్ రోడ్డు నుంచి మార్కెట్ యార్డు వరకు ఆర్అండ్‌బి రోడ్డు పోరంబోకు స్థలంలో నివశిస్తున్న తమకు పొజిషన్ సర్టిఫికెట్స్ మంజూరు చేయాలని ఆగిరిపల్లి హైస్కూల్ రోడ్డు నుంచి మార్కెట్ యార్డ్ వరకు రోడ్డు పోరంబోకు స్థలంలో ఇళ్లు నిర్మించుకుని జీవిస్తున్న బడుగు బలహీన వర్గాల ప్రజలు కోరారు. ఈ మేరకు నూజివీడు నియోజకవర్గ బిసి సెల్ అధ్యక్షులు ఆరేపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మంత్రి పార్థసారధిని బుధవారం కలిసి తమ గోడు వెళ్లగక్కారు. గత ప్రభుత్వ హయాంలో అప్పటి తహశీల్దార్ వైసిపికి అనుకూలమైన వారికి మాత్రమే పొజిషన్ సర్టిఫికెట్లు మంజూరు చేసి గృహ నిర్మాణాలకు రుణాలు మంజూరు చేశారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రి పార్థసారధి మాట్లాడుతూ అర్హులైన ప్రతిఒక్కరికీ నివేశన స్థలాలు కేటాయించి న్యాయం చేస్తానని, వైసిపికి అనుకూలంగా రెవెన్యూ సిబ్బంది ఎలా పని చేశారని ఆయన అగ్రహం వ్యక్తం చేయటంతో పాటు, దీనిపై సమగ్ర నివేదిక అందించాలని తహశీల్దార్ బి.మృత్యుంజయరావును ఆదేశించారు.

సిపిఎం ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని అంకన్నగూడెం పంచాయతీ దిబ్బగూడెంలో సిపిఎం ఆధ్వర్యంలో బుధవారం దుప్పట్లు పంపిణీ చేసినట్లు సిపిఎం మండల కార్యదర్శి తెల్లం దుర్గారావు తెలిపారు. డిసిసిబి రిటైర్డ్ మేనేజర్ చంద్రకాంత్ ఆర్థిక సహాయంతో గ్రామంలోని పేదలకు దుప్పట్లు పంపిణీ చేసినట్లు చెప్పారు. మారుమూల గిరిజన గ్రామాల్లో ఉంటూ కనీస వసతులు లేక ఇబ్బందులు పడుతున్న గిరిజనులను గుర్తించి వారిని ఆదుకోవడం అభినందనీయమని పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి అన్నారు. ఈ సహాయం పలువురికి ఆదర్శమని ఆయన సేవలను కొనియాడారు. దాతల తరపున సహాయ సహకరాలు అందించడంలో సిపిఎం ఎప్పుడూ ముందుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా సెక్రటరీ సభ్యులు తెల్లం రామకృష్ణ, జిల్లా కమిటీ సభ్యులు గుడెల్లి వెంకట్రావు, గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పోలోజి నాగేశ్వరరావు, మండల కమిటీ సభ్యులు సిరిబత్తుల సీతారామయ్య, కారం నాగదుర్గ, కల్లూరి దావీదు, గుండే గంగరాజు, వంశీ, నాగేంద్ర పాల్గొన్నారు.

నేడు దేశ వ్యాప్త విద్యాసంస్థల బంద్ జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

నీట్ పరీక్షా విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ ఈ నెల నాలుగో తేదీన నిర్వహించే దేశవ్యాప్త విద్యాసంస్థల బంద్ జయప్రదం చేయాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జి.సూర్యకిరణ్, పిడిఎస్‌యు రాష్ట్ర అధ్యక్షులు నాగభూషణం పిలుపునిచ్చారు. జంగారెడ్డిగూడెం ప్రజాసంఘాల కార్యాలయంలో డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థి యువజన సంఘాల ముఖ్య కార్యకర్తల సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సమావేశానికి డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, పిడిఎస్‌యు సంఘాల నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జి.సూర్యకిరణ్, నాగభూషణం మాట్లాడుతూ నీట్ జాతీయస్థాయి పరీక్షలను నిర్వహించడంలో విఫలమైందన్నారు.

ఏలూరు అర్బన్ :ఈ నెల నాలుగో తేదీ బుధవారం దేశ వ్యాప్త విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని పిడిఎస్ఒ జిల్లా కార్యదర్శి సవలం మోహన్ బుధవారం ఒక ప్రకటన లో పిలుపునిచ్చారు. ఈ బంద్‌లో అన్ని విద్యా సంస్థలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ముసునూరు :ఈ నెల నాలుగో తేదీ గురువారం దేశవ్యాప్తంగా జరిగే విద్యాసంస్థల బంద్‌కు సహకరించాలని సిఐటియు జిల్లా నాయకులు జి.రాజు కోరారు. బుధవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. జాతీయ స్థాయి పరీక్షలను నిర్వహించడంలో ఎన్‌టిఎ విఫలమైందని, దేశంలో విద్యావ్యవస్థపై దాడికి నిరసనగా జరిగే దేశవ్యాప్త బంద్‌ను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

డయేరియా కేసులు పెరగకుండా చర్యలు

ముసునూరు :డయేరియా కేసులు పెరగకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామని ముసునూరు సర్పంచి కొండేటి విజయలక్ష్మి బాబి తెలిపారు. బుధవారం ఆమె ప్రాథమిక సిబ్బందితో పాటు ఎంపిపి కార్యాలయ సిబ్బంది, పంచాయతీ సిబ్బంది, పలు శాఖల అధికారులతో సమీక్షలు నిర్వహించారు. ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇని కలిసి డయేరియా కేసులు పెరగకుండా చూడాలని కోరారు.

చీపురుగూడెంలో మెడికల్ క్యాంపు

ప్రజాశక్తి - చాట్రాయి

మండలంలోని చీపురుగూడెం గ్రామంలో జ్వరాలు ఎక్కువగా ఉండటంతో ప్రభుత్వ వైద్య సిబ్బంది బుధవారం మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ క్యాంపు దళితవాడలో నిర్వహించి ఏడుగురికి జ్వరాలు ఉన్నట్లు గుర్తించి తొమ్మిది మంది రక్త నమూనాలను, తాగునీటి నమూనాను పరీక్షల నిమిత్తం ఏలూరు పంపించినట్లు డిస్టిక్ డిసీజ్ అధికారి డాక్టర్ నరేంద్రకృష్ణ తెలిపారు. వాటర్ ట్యాంకు గ్రౌండ్ లెవెల్ వాల్ లీకేజీని గుర్తించి ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇతో మాట్లాడి వాలు మార్పు చేయించారు. డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ లక్ష్మీనారాయణ గ్రామస్తులకు తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. డిపిఎం ఒ డాక్టర్ కె.విజయలక్ష్మి క్యాంపులో వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ క్యాంపులో డాక్టర్ దుర్గాప్రసాద్, డాక్టర్ శ్రీనివాసరెడ్డి, డాక్టర్ ఎం.జ్యోతి వైద్య సేవలందించారు. పదిమంది పారా మెడికల్ సభ్యులు ఇంటింటికి తిరిగి ప్రజలకు అవగాహన కల్పిస్తూ కాచి చల్లా ర్చిన నీటిని తాగాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచు కోవాలని తెలిపారు. గ్రామంలో పారిశుధ్య మెరుగుదల కు తగు చర్యలు తీసుకోవాలని చాట్రాయి ఎంపిడిఒ మం గకు మారితో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో చాట్రాయి ప్రాథ మిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది సిహెచ్ఒ జివి.రమ ణ, సూపర్‌వైజర్ ప్రభాకర్, ఎఎన్ఎం పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి వెంకటరాజు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - కామవరపుకోట

ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన కామవరపుకోట విశాలాంధ్ర విలేకరి టి.రామకృష్ణ పిల్లల చదువు నిమిత్తం కొయ్యలగూడెం మండలం బయన్నా గ్రామానికి చెందిన నాటకశాల వెంకటరాజు బుధవారం రూ.లక్ష బాధిత కుటుంబసభ్యులకు అందించారు. ఈ సందర్భంగా వెంకటరాజు మాట్లాడుతూ చదువు నిమిత్తం నిరుపేద విద్యార్థులను తన వంతు సహాయంగా ప్రోత్సహించడమే తన లక్ష్యమన్నారు. మిత్రులు వీరమల్ల మధు, కడిపి పాపారావుల అభ్యర్థన మేరకు రాము పిల్లల చదువు నిమిత్తం సహాయం అందించానని, రానున్న రోజుల్లో కూడా వారికి అండగా ఉంటానని తెలిపారు.

ప్లాస్టిక్‌ను వినియోగించొద్దు

మండవల్లి :ప్లాస్టిక్ సునామీలా మారి భూమిని మింగేస్తుందని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యత సభ్యులు ఎల్ఎస్.భాస్కరరావు అప్పారావు స్పష్టం చేశారు. అంతర్జాతీయ ప్లాస్టిక్ సంచుల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఐక్యవేదిక ఆధ్వర్యంలో విశ్వ భారతి పబ్లిక్ స్కూల్ విద్యార్థులతో బుధవారం పెద్ద ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకం విపరీతంగా పెరిగిపోవడంతో పర్యావరణం ప్రశ్నార్థకంగా మారబోతుం దన్నారు. ఒక్కసారి ఉపయోగించే ప్లాస్టిక్ సంచుల వల్ల అన్ని రకాల కాలుష్యాలు పెరిగి మూగజీవాల ప్రాణాలకు హాని కలుగుతుందన్నారు. ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపించే ప్లాస్టిక్ వినియోగం తగ్గించి గోనె కాగిత సంచులను వినియోగించాలన్నారు. ప్లాస్టిక్ సంచుల వినియోగంపై నిషేధం ఉన్నప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో అది ఎక్కడ అమలు కావడం లేదని తెలిపారు. ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించి నిషేధాన్ని కట్టుదిట్టంగా అమలు చేయాలని, లేకపోతే భావితరాల మనుగడ ప్రశ్నార్థకంగా మారిపోతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. 120 మైక్రాల కంటే తక్కువ మందం ఉండే పాలిథిన్ తయారీని ప్రభుత్వాలు నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐక్యవేదిక కోశాధికారి బండారు వెంకయ్య, బండి రంగారావు, హెచ్ఎం రంగనాథస్వామి, లక్ష్మి, అంజని, నాగవల్లి, శ్రీదేవి, లావణ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యవసాయాధికారులు రైతులకు అందుబాటులో ఉండాలి

ప్రజాశక్తి - మండవల్లి

వరి సాగులో తలెత్తే సమస్యలను త్వరితగతిన పరిష్కరించే విధంగా రైతులకు సకాలంలో తగు సూచనలను, సలహాలను అందించాలని జిల్లా వ్యవసాయ శాఖాధికారి ఎస్‌కె.హబీబ్ బాషా తెలిపారు. వ్యవసాయ శాఖాధికారులు పెట్టుబడిలేని వ్యవసాయం చేసే రైతులతో కలిసి లింగాలలోని నారుమడులను, వెదజలిన పొలాలను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ శాఖాధికారులు రైతులకు అందుబాటులో ఉండాలన్నారు. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధించే విధంగా రైతులు అధికారుల సూచనలను విధిగా పాటించాలన్నారు. అనంతరం మండవల్లి ముదినేపల్లి మండలాలలోని వివిధ రైతు సేవా కేంద్రాలను, వరి పొలాలను, పచ్చిరొట్ట పైరును, మట్టి నమూనాలు తీసే ప్రక్రియను, పురుగుమందుల షాపులు తనిఖీ చేశారు.

రైతులు శాస్త్రవేత్తల సూచనలు పాటించాలి

చింతలపూడి :రైతులు నేరుగా వెదజల్లే వరి సాగులో శాస్త్రవేత్తల సూచలను పాటించి మంచి దిగుబడులు సాధించాలని వ్యవసాయ సహాయ సంచాలకులు లలిత సుధ తెలిపారు. ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, గుంటూరు పరిధిలోని ఏరువాక కేంద్రం, ఏలూరు శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖాధికారులు సంయుక్తంగా రైతు శిక్షణా కార్యక్రమాన్ని (నేరుగా వెదజల్లే వరిలో సమగ్ర యాజమాన్యం) మండలంలోని సమ్మెటివారిగూడెంలో బుధవారం నిర్వహించారు. ఏరువాక కేంద్రం సమన్వయకర్త డాక్టర్ కె.ఫణి కుమార్, మండల వ్యవసాయ అధికారి మీనా పలు సూచనలు చేశారు.